సాక్షి
కర్నూలు
బుధవారం, 16, ఆగస్టు, 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కృష్ణా జిల్లాకు చెందిన శ్రీనివాసరెడ్డి రూ.1,01,116 లు విరాళంగా అందజేశారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ ప్రాంగణంలోని శనగల బసవన్న, శ్రీబయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



'సుంకేసుల'కు నిలిచిన ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. ప్రస్తుతం డ్యాంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు మంగళవారం తెలిపారు.



పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న మంత్రి బుగ్గన, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ



సాంస్కృతిక ప్రదర్శనలో కేజీబీవీ విద్యార్థినులు



నృత్య ప్రదర్శన చేస్తున్న అంజికా శిశు కేంద్రం చిన్నారులు

సంక్షేమ విప్లవం

సచివాలయాలతో పారదర్శక పాలన

- ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు
- ప్రత్యేక ప్రణాళికతో పశ్చిమ ప్రాంత అభివృద్ధి
- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదాం
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయాలతో ఆవిష్కృతమవుతోందని, సంక్షేమ విప్లవానికి ఈ వ్యవస్థ నాంది పలికిందని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయన కొండారెడ్డి బురుజు వద్దనున్న పోలీసు పరేడ్ మైదానంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి కవాతు వాహనం పైనుంచి సాయుధ పోలీసు దళ పరిశీలన చేశారు. అనంతరం వేదిక పైనుంచి జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి ప్రసంగించారు. ''గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలుతో పాలన నేరుగా ప్రజల గడప వద్దకే తీసుకెళ్లాం. ప్రజలు మండలం, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా గ్రామస్థాయిలో ఇంటి ముంగిటే అన్ని సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలు తెలుసుకుని 4.38 లక్షల సర్టిఫికెట్లను నేరుగా ప్రజల వద్దకు వెళ్లి అందించాం.'' అన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా...

విత్తు నుంచి విక్రయం దాకా రైతులకు అవసరమయ్యే అన్ని రకాల సేవలను గ్రామంలోనే అందించేలా జిల్లాలో 466 వైఎస్సార్ భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేసేందుకు జిల్లా అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ 3,425 మంది అర్హులను గుర్తించింది. వీరికి త్వరలోనే 4,116.62 ఎకరాల భూమిని పంపిణీ చేసేందుకు పట్టాలు సిద్ధం చేస్తున్నాం. వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 2.86 లక్షల మంది రైతులకు రూ.215 కోట్ల పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకుల ఖాతాల్లో జమ చేశాం. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ ఉచిత పంటల బీమాతో రైతులకు అండగా నిలుస్తున్నాం.

పేదలందరికీ ఇళ్లు

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా జిల్లాలో 81,353 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. జిల్లాలో మొదటి విడతలో 308 లేఅవుట్లలో 55,287 గృహ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 14,371 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశాం. ఏపీ టిడ్కో కింద రూ.873 కోట్ల అంచనా వ్యయంతో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఇప్పటివరకు 16,257 ఇళ్లు పూర్తయ్యాయి. రూ.223 కోట్లతో మౌలిక వసతులు, నీటి సరఫరా, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు విద్యుద్దీకరణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తాం. అదేవిధంగా రూ.140 కోట్లతో క్లస్టర్ యూనివర్సిటీ భవన సముదాయాలను నిర్మిస్తున్నాం. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం.. వైఎస్సార్ సున్నావడ్డీ పథకం.. వైఎస్సార్ ఆసరా పథకాలను అమలు చేస్తున్నాం.

పేదలందరికీ ఆరోగ్య సిరి

పేద ప్రజలకు కార్పొరేట్ తరహా ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏపీలోనే కాకుండా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో కూడా ఆరోగ్యశ్రీ కింద 3,257 రకాల జబ్బులకు ఉచిత వైద్యం అందిస్తున్నాం. జిల్లాలో 90 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 2019 నుంచి ఇప్పటివరకు రూ.437 కోట్లు వెచ్చించి రెండు లక్షల మందికి పైగా ఉచితంగా చికిత్సలు చేయించాం.

శాశ్వత అభివృద్ధి

పశ్చిమ ప్రాంతంలోని కరువుపీడిత మండలాల్లో 10,130 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా 68 చెరువులకు హంద్రీనీవా సుజలస్రవంతి ప్రధాన కాల్వల నుంచి 1.234 టీఎంసీల నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రూ.166 కోట్లు ఇప్పటివరకు ఖర్చు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశాం. త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నాం. గాజులదిన్నె ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.50 టీఎంసీల నుంచి 5.50 టీఎంసీలకు పెంచేందుకు రూ.57.35 కోట్లతో చేపట్టిన పనులు 60 శాతం పూర్తయ్యాయి.

పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

దశాబ్దాలుగా వెనుకబడిన కర్నూలు పశ్చిమ ప్రాంతంలో వలసలను నివారించే ఉద్దేశంతో జనవరి 2022లో రాష్ట్ర ప్రభుత్వం ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలతో ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశాం. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆదోని రాంజల చెరువు, గాజులదిన్నె ప్రాజెక్టు, జి.ఎర్రగుడి ప్రాంతంలో అశోక రాతి చిత్రాలను పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తాం.

విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు

విద్యార్థుల బంగారు భవితకు జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాం. ఈ పథకం కింద ఏడాదికి 2.40 లక్షల మందికి పైగా విద్యార్థుల తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.1,439 కోట్లను వారి బ్యాంకు ఖాతాలో జమ చేశాం.

- జగనన్న గోరుముద్ద పథకం ద్వారా 1439 పాఠశాలల్లోని 2.74 లక్షల మంది విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంగా అందిస్తున్నాం.
- మంగళ, శనివారాల్లో అదనంగా పిల్లలకు రాగిజావ ఇస్తున్నాం. విద్యార్థులు రక్తహీనత బారిన పడకుండా ఐరన్, ఫోలిక్‌యాసిడ్ ట్యాబ్లెట్లను పంపిణీ చేస్తున్నాం.
- జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్య దీవెన, జగనన్న విద్యాకానుక పథకాలతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాం.



సంక్షేమానికి ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. వైఎస్సార్ పింఛను కానుకను ప్రతినెలా 1వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా 2,36,773 మందికి రూ.65.83 కోట్లను ఇంటి వద్దే అందిస్తున్నాం.

- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 1.50 లక్షల మందికి పైగా రూ.845 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాం.
- వైఎస్సార్ చేయూత కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు 56,441 కిరాణ, టెక్స్‌టైల్ దుకాణాలు ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రూ.202 కోట్ల రుణాలు మంజూరు చేయించాం.

జిల్లా విద్యార్థినులకు ప్రతిభా పురస్కారం



పెద్దహరివణం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని రెహానాకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి

కర్నూలు సిటీ: ఈ ఏడాది జనవరిలో గుజరాత్ రాష్ట్రంలో జరిగిన 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (2022)కార్యక్రమంలో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎలక్ట్రిసిటీ ఫ్రమ్ వర్టికల్ కర్వ్ బ్లేడ్స్ అనే అంశంపై చేసిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైంది. ఆదోని మండలం పెద్ద హరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ ఎస్.చిరంజీవి పర్యవేక్షణలో విద్యార్థినులు రెహానా, మేఘన ఈ ప్రాజెక్టును ప్రదర్శించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆర్థిక మంత్రి బుగ్గన, జిల్లా కలెక్టర్ సృజన సదరు విద్యార్థినులను అభినందించి అవార్డు అందజేశారు.

స్వాతంత్య్ర సమరయోధుల వారసులకు సత్కారం

పెరేడ్ మైదానంలో పాల్గొన్న స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్ ఖాన్, జరదొడ్డి సుధాకర్, కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి ఘనంగా సన్మానించారు. స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు గుర్రం జైపాల్‌రెడ్డి, జి.సుబ్బమ్మ, ఎం.సి.యంకమ్మ, ఎస్.డి.నాగేంద్రప్రసాద్, ఎల్.సరోజమ్మ, డి.రాధాకృష్ణమూర్తి, ఎస్.ఐ.బాషాబియాబాని, సైదా జైనాబీబీ, ఎస్.బి.విష్ణువర్ధన్, ఖతం తుక్కు చంద్రకుమార్ తదితరులు హాజరుకాగా శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. పెరేడ్ మైదానంలో జిల్లా అభివృద్ధి ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను అధికారులతో కలసి మంత్రి బుగ్గన పరిశీలించారు. మొత్తం 11 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మెరుగైన సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. వేడుకల్లో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, నగర మేయర్ బీవై రామయ్య, జేసీ నారపురెడ్డి మౌర్య, సెబ్ అదనపు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ మంత్రి మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు ఎన్నికల అధికారులకు శిక్షణ

కర్నూలు(అర్బన్): ఈ నెల 19న గ్రామ పంచాయతీ సర్పంచు, వార్డు సభ్యుల ఉప ఎన్నికల నేపథ్యంలో స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 16న శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్ణాతులైన డ్వామా ఏపీడీ సిద్ధలింగమూర్తి, సి.బెళగల్ ఎంపీడీఓ రాముడు శిక్షణ ఇస్తారన్నారు. జిల్లాలోని కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ సర్పంచుతో పాటు వేర్వేరు గ్రామ పంచాయతీల్లోని 15 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పంచాయతీల్లో ప్రారంభమైన నగదు రహిత చెల్లింపులు



చిన్నటేకూరులో డిజిటల్ చెల్లింపులను పరిశీలిస్తున్న డీపీఓ

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ పంచాయతీలో ప్రారంభించిన డిజిటల్ చెల్లింపులను పరిశీలించామన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసుకున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల జనాభాను అనుసరించి బ్యాంకు అధికారులు పీఓఎస్ మిషన్లు, క్యూఆర్ కోడ్‌లను సమకూర్చారన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 3వేలకు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో పీఓఎస్ మిషన్ల ద్వారా, 3వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేపట్టాలన్నారు.

జిల్లాకు చేరిన వీవీప్యాట్ మిషన్లు



వీవీ ప్యాట్లను గోదాముకు తరలిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): వచ్చే ఎన్నికల్లో వినియోగించేందుకు కేటాయించిన వీవీప్యాట్ మిషన్లు మంగళవారం కర్నూలు చేరాయి. వాటిని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఈవీఎం గోదాములో భద్రపరిచారు. బెంగళూరులోని బెల్ కంపెనీ తయారుచేసిన ఈ మిషన్లలో ఎన్నికల్లో ఎవరికి ఓటు వేశామో చూసుకునేందుకు ప్రింట్ కూడా వస్తుంది. జిల్లాకు 6,650 వీవీప్యాట్ మిషన్లను ఎన్నికల సంఘం కేటాయించింది.

అన్ని పరీక్షల్లోనూ ఆమే ఫస్ట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసిస్తున్న పి. నమ్రత అన్ని రకాల పరీక్షల్లోనూ ప్రథమంగా నిలుస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది. ప్రస్తుతం ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని హౌస్‌సర్జన్ చేస్తున్న ఆమెకు తాజాగా మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆమె జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీలో ఫస్ట్‌గా నిలిచారు. అలాగే పార్ట్–2 ఎగ్జామ్‌లోనూ ఆమె ప్రథమంగా నిలిచింది. దీంతో పాటు జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు నిర్వహించిన శ్రీ దిగువింటి సాయిసృజన్ మెమోరియల్ ఎగ్జామ్‌లో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఆమె జనరల్ సర్జరీ ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ హరిచరణ్, కంటి వైద్యురాలు డాక్టర్ నివేదిత కూతురు.



ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పి. నమ్రత



చిరుధాన్యంతో ఆరోగ్యం.. వ్యవసాయశాఖ శకటం ప్రదర్శన

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

కర్నూలు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు పరేడ్ మైదానంలో వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, సర్వశిక్ష అభియాన్, దిశ పోలీస్ శాఖ, ఫాల్కన్ పోలీస్ శాఖలకు సంబంధించిన శకటాలు ఆయా డిపార్ట్‌మెంట్లు సాధించిన ప్రగతిని ప్రదర్శించాయి. ఇందులో వ్యవసాయ, విద్య, గృహనిర్మాణ శాఖల శకటాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి.



చదువే ఆస్తి.. విద్యాశాఖ శకటం



పేదలందరికీ గూడు.. హౌసింగ్ శాఖ రూపొందించిన శకటం

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రం

కర్నూలు(లీగల్): మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. పంద్రాగస్టు వేడుకలను మంగళవారం జిల్లా కోర్టులో ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు జిల్లా కోర్టులో జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాస్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పాండురంగారెడ్డి, ఏసీబీ కోర్టు జడ్జి సునిత, సబ్ జడ్జీలు దివాకర్, సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జీలు ఫకృద్దీన్ బాబా, టి.జ్యోత్స్న దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎంవీ చక్రపాణి, జీపీ ఆనందరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లక్ష్మీనారాయణ, రాంభగవాన్, నరేంద్రనాథ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జి.స్వాములు, జూనియర్ సివిల్ జడ్జీలు కల్యాణి, పఠాన్ సియాజ్ ఖాన్, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు

స్వాతంత్య్ర సమరయోధులే స్ఫూర్తి

- జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): దేశానికి స్వాతంత్య్రం సాధించి పెట్టిన సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు జెడ్పీ ప్రాంగణంలో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, చైర్మన్ సీసీ అశ్వినీకుమార్, కార్యాలయ పర్యవేక్షకులు రాంగోపాల్, జితేంద్ర మురళీమోహన్‌రెడ్డి, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ పాల్గొన్నారు.



పంద్రాగస్టు వేడుకలో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

క్లుప్తంగా

వరుసగా రెండో ఏడాది



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

కర్నూలు సిటీ: మునిసిపల్ స్కూళ్ల విభాగంలో డా.ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా నిలిచింది. ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆ స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వరుసగా రెండో ఏడాది రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడంతో హెచ్‌ఎంకు పలువురు అభినందనలు తెలిపారు.

గొర్రెల మందపై చిరుతలు దాడి

- ఒక గొర్రె మృతి

కోసిగి: స్థానిక తిమ్మప్ప కొండ వెనుక భాగంలోని సత్యమ్మ గుడి సమీపంలో నిలిపిన గొర్రెల మందపై మంగళవారం రాత్రి రెండు చిరుతలు దాడి చేశాయి. గొర్రెల కాపరి నరసప్ప అలియాస్ తిక్కయ్యకు చెందిన ఒక గొర్రెను కొండల్లోకి ఈడ్చుకెళ్లిందని కాపరులు తెలిపారు. కాపరలు కేకలు వేయడంతో కొండ పరిసరాల్లో గొర్రెకు సంబంధించి పొట్ట భాగం మాత్రమే వదిలేసి వెళ్లిందని నరసప్పతో పాటు పలువురు తెలిపారు. కోసిగి పరిసరాల్లో నాలుగేళ్లుగా చిరుతలు సంచరిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. కొండ పరిసర ప్రాంతాల్లో గొర్రెలు, కుక్కలపై చిరుతులు దాడి చేసిన ఘటనలు వారంలో రెండు మూడు చోటు చేసుకుంటున్నాయి. అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కొండ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌లో 985 టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఆటో నగర్‌కు చెందిన యశోదమ్మ, పాతపేటకు చెందిన ఈడిగ వినయ్ కుమార్ గౌడ్ తారకరామనగర్‌లోని కాలువ దగ్గర కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేసి వారిద్దరిని అదుపులోకి తీసుకొని 10 బాక్సుల మద్యం (టెట్రా ప్యాకెట్లు)స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి జడ్జి ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది ఓబులేసు, చాంద్‌బాషా, మద్దిలేటి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు సిటీ: నంద్యాల జిల్లా ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1966 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం నగరంలో ఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. 57 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు మద్దెల రంగారెడ్డి, ఓబుల్ రెడ్డిలను సత్కరించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు వైవీ కృష్ణారెడ్డి, ఎస్.జయరామయ్య, ఎస్.శంకర్ రెడ్డి, టి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ నాగేశ్వరరావు, డీఆర్వో; డి.హరిప్రసాద్, ఆర్డీఓ,కర్నూలు; మోహన్‌దాస్, ఆర్డీఓ,పత్తికొండ; మల్లికార్జునుడు, స్పెషల్ డీసీ; ఏవీ రమణ, సెట్కూరు సీఈఓ; నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ; వెంకటేశ్వర్లు, డీసీ, లేబర్; రామచంద్రరావు, డీడీ, ట్రెజరీ; రాజశేఖర్, డీడీ, మైనింగ్; దీప్తి, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్; శ్రీకాంత్‌రెడ్డి, డీసీడీఓ; సబీహ పర్వీన్, జిల్లా మైనార్టీ ఆఫీసర్; నాగరాజు నాయుడు, డీపీఓ



విజయ, జిల్లా పర్యాటక అధికారి; శ్రీనివాసకుమార్ ఎస్సీకార్పొరేషన్ ఈడీ; శివశంకర్‌రెడ్డి, డీఎఫ్ఓ; రామాంజనేయులు, హార్టికల్చర్ ఆఫీసర్; శ్యామలమ్మ, జేడీ, ఫిషరీస్; ఉమాదేవి, పీడీ, ఏపీఎంఐపీ; అమర్నాథ్‌రెడ్డి, పీడీ, డ్వామా; నాగశివలీల, పీడీ,డీఆర్‌డీఏ; వేణుగోపాల్, ఏపీసీ, ఎస్ఎస్ఏ; బి.నాగేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యుఎస్; నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్; ఉమామహేశ్వరి, పీడీ, ఐసీడీఎస్; బాలాజీ, సూపరింటెండెంట్, సీపీఓ

ఉత్తమ సేవలకు పురస్కారం

ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 575 మందికి పురస్కారాలు ప్రకటించారు. కర్నూలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సృజన వాటిని ప్రదానం చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



మంత్రి బుగ్గన చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్



కిరణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్; వి.రంగారెడ్డి,జీజీహెచ్ సూపరింటెండెంట్; డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఓడీ; నరసింహ, సబ్ రిజిస్ట్రార్, రెడ్‌క్రాస్; బి.శ్రీనివాసులు, ఇ-సెక్షన్, కలెక్టరేట్



ఎం.ఇలియాస్, సబ్ ఆర్డినేట్; సుబ్రహ్మణ్యం, ఎస్ఈ, పీఆర్; డాక్టర్ మహేంద్ర, రెడ్‌క్రాస్; శివప్రసాద్, డీటీ, డి-సెక్షన్, కలెక్టరేట్; జ్యోతిర్మయి, ఆస్పరి వీహెచ్ఏ



సుధ, డీటీ, కలెక్టరేట్; సతీష్‌కుమార్, వీఆర్వో, ఓర్వకల్లు; జయన్న,తహసీల్దార్ కోడుమూరు; నాయక్,తహసీల్దార్ గూడూరు; శివప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్, ఓర్వకల్లు; శివరాముడు,తహసీల్దార్, కర్నూలురూరల్; రమేష్ బాబు, తహసీల్దార్, కల్లూరు; ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ; శివనారాయణ స్వామి, డీఎస్పీ; ఎం. నాగభూషణం డీఎస్పీ ట్రాఫిక్; యుగంధర్, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ; ప్రవంతి, ఎంఓ, పోలీస్ హాస్పిటల్; శ్రీరాం, సీఐ, కర్నూలు తాలూకా



ఆదినారాయణరెడ్డి, సీఐ, ఫ్యాక్షన్ జోన్; శంకరయ్య, సీఐ, ఫోర్త్ టౌన్, కర్నూలు; డి.మురళీధర్‌రెడ్డి, సీఐ, త్రీటౌన్; కె.మనోహర్, ఎస్ఐ; బీఎస్ రమణ, ఆర్ఎస్ఐ; పోతుల రాజు, ఆర్ఎస్ఐ; ఎల్.రఘురామయ్య, ఎస్ఐ; కె.శ్రీనివాసులు, ఎస్ఐ, ఇస్వి పీఎస్; మోహన్‌కిశోర్ రెడ్డి, ఎస్ఐ, ఫోర్త్‌టౌన్; జె.మన్మథ విజయ్, ఎస్ఐ, తాలూకా పీఎస్; నరేంద్రకుమార్‌రెడ్డి, ఎస్ఐ, కౌతాళం; డి.రాజన్న, ఎస్ఐ, ట్రాఫిక్ పీఎస్; మహాలక్ష్మి, మహిళా ఆర్ఎస్ఐ



మాధవరెడ్డి, ఏఎస్ఐ, ఎస్‌బీ; అనూష, సూపర్‌వైజర్, ఐసీడీఎస్; గోవిందరెడ్డి, లైబ్రేరియన్, కర్నూలు; రుద్రగౌడ్, తహసీల్దార్, కోసిగి; గోవింద్ సింగ్, ఏఓ, సబ్ కలెక్టర్ ఆఫీసు; కె.రామేశ్వరరెడ్డి, తహసీల్దార్; ఆర్.విష్ణుప్రసాద్, తహసీల్దార్; శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్, సీసీఎస్; ఎం.చంద్రకళ, డీటీ, ఎస్ఎస్పీ, కర్నూలు; లోకేశ్వరి,డీటీ, ఎస్ఎస్పీ, కర్నూలు; విజయ్‌కుమార్, కోసిగి ఎస్‌బీ ఏఎస్ఐ; పి.మధుసూదన్, ఎంసీ మెంబర్, రెడ్‌క్రాస్; బసవరాజు, వందగల్లు వీఆర్వో



పరేడ్ గ్రౌండ్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సత్కరిస్తున్న మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి



డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఫండ్ అందజేస్తున్న మంత్రి బుగ్గన, చిత్రంలో జెడ్పీచైర్మన్, మేయర్, ఎమ్మెల్యే

2.80 లక్షల హెక్టార్లలో పంటల సాగు

- 66.59 శాతం సాగు పూర్తి,
- పెరుగుతున్న పత్తి సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఖరీఫ్ సాగు క్రమంగా పెరుగుతోంది. ఇటీవల వరకు జిల్లా వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు పడటంతో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ నెల 8వ తేదీ నాటికి సాగు విస్తీర్ణం 2,51,983 లక్షల హెక్టార్లు ఉంది. ఇటీవలి వరకు ఆశాజనకంగా వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.... ఈ నెల 14 నాటికి సాగు విస్తీర్ణం 2,80,659 హెక్టార్లకు పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి 3.39 లక్షల హెక్టార్లలో పంటలు సాగు అయ్యాయి. ఈ సారి వర్షాలు ఆలస్యంగా పడటంతో సాగు కొంత తగ్గింది. ఇప్పటి వరకు పంటల సాగు 66.58 శాతం పూర్తి అయింది. అత్యధికంగా పత్తి సాగు కావడం విశేషం. సాధారణ సాగు 2.50 లక్షల హెక్టార్లు ఉండగా... ఇప్పటి వరకు పత్తి 1,70,748 హెక్టార్లలో సాగు అయింది. వేరుశనగ 39,543, వరి 2884, ఆముదం 6753, సజ్జ 4798, మొక్కజొన్న 3488, కంది 19038, మిర్చి 17218, ఉల్లి 10048, టమాట 973, కొర్ర 1189 హెక్టార్ల ప్రకారం పంటలు సాగు అయ్యాయి. వచ్చే వారానికి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

లారీ పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : ప్యాపిలి వద్ద అక్రమంగా డీటైయిన్డ్ ఫౌడర్ తరలిస్తున్న లారీని దాడి చేసి పట్టుకున్నట్లు మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున ప్యాపిలి వద్ద ఆ లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. లారీ యజమానికి రూ.50 వేలు జరిమానా విధించామని వెల్లడించారు. ఎవరైనా అనుమతులు లేకుండా నాపరాయి, కలర్ బండలు, డీటైయిన్డ్ ఫౌడర్, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కళలు సమాజ చైతన్య దీపికలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



నాటకాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ కుటుంబ సభ్యులు, ప్రేక్షకులు,



నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: కళలు సమాజ చైతన్య దీపికలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. 77వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రంలో మంగళవారం సాయంత్రం పడమటి గాలి నాటకాన్ని ప్రదర్శించారు. రిటైర్డ్ కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య దర్శకత్వంలో డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు రచనలో, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య నిర్వహణలో ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను అలరించింది. కలెక్టర్ డాక్టర్ జి.సృజన, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో నాటక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పడమటి గాలి నాటకం ఎంతో ఆలోచించేలా ఉందన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం కన్నా సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలనే సందేశం ఇచ్చారన్నారు. ఇలాంటి నాటకాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు. పడమటి గాలి నాటక ప్రదర్శనలకు తన వంతుగా సహకరిస్తానన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కళాకారులను ఆదుకోవడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బలరామయ్య జిల్లా కలెక్టర్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత తనలోని కళాకారుడిని నాటక రూపంలో బయటికి తీసుకురావడం సంతోషదాయకమన్నారు.అంతకు ముందు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్న కళాకారులను అతిథులు సత్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆడిటోరియంలో ఆధునిక లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్నారు.

సిరుల పంట!

- జిల్లాలో పెరుగుతున్న బొప్పాయి సాగు
- ఇప్పటికే దాదాపు 5 వేల ఎకరాల్లో బొప్పాయి తోటలు
- ఈ ఏడాది మరో 1000 ఎకరాల్లో పెరుగునున్న సాగు
- తక్కువ పెట్టుబడి.. దిగుబడి ఎక్కువ
- మార్కెట్‌లో రికార్డు స్థాయి ధరలు
- రైతులకు కలిసి వస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహం



సాగు చేసిన బొప్పాయి పంట



కర్నూలు(అగ్రికల్చర్): బొప్పాయి సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుతం బొప్పాయికి ధరలు లభిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, అధిక నికరాదాయం వస్తుంది. దీంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటంతో పండ్లతోటల సాగు జోరందుకుంది. ఇదే సమయంలో బొప్పాయి సాగు కూడా పెరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో ఎటు చూసినా బొప్పాయి తోటలే కనిపిస్తున్నాయి. జిల్లాలో దాదాపు 5వేల ఎకరాల్లో ఉన్న ఈ పంట.. ఈ ఏడాది అదనంగా మరో 1000 ఎకరాలు పెరగనుంది. బొప్పాయి సాగును ఇటు ఉద్యాన శాఖ, అటు జిల్లా నీటియాజమాన్య సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. తక్కువ వ్యవధిలో కాపునకు వస్తుండటంతో రైతులు ఈ పంట సాగును ముమ్మరం చేశారు. గతంలో బొప్పాయి అంటే కోయంబత్తూరు (కో-1, కో-2, కో-3) రకాలు ఎక్కువగా సాగు చేసేవారు. ఇటీవలి కాలంలో తైవాన్ రెడ్ లేడి-786 రకం బహుళ ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఉన్న బొప్పాయిలో 60 శాతం తైవాన్ రెడ్ లేడీ రకాలేనని స్పష్టమవుతోంది. ఎకరాకు 1000 మొక్కల వరకు నాటుకోవచ్చు. బొప్పాయి మొక్కలు నాటిన 6-7 నెలలకే కాపు వస్తుంది. మొదటి ఏడాది కాయలు ఎక్కువ సైజు, బరువుతో వస్తాయి. ఒక్కసారి మొక్కలు నాటితే రెండు, మూడేళ్ల పంట వస్తుంది. మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి వ్యయం ఉంటుంది. తర్వాత ఖర్చు నామమాత్రంగానే ఉంటుంది.

నేడు టన్ను ధర రూ.18 వేల వరకు

బొప్పాయికి నేడు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో రికార్డు స్థాయిలో ధరలు లభిస్తున్నాయి. సాధారణంగా బొప్పాయి టన్ను ధర రూ.5వేల నుంచి రూ.8 వేల వరకు ఉంటుంది. ఇప్పుడు మార్కెట్‌లో టన్ను ధర రూ.18 వేలు ఆపైనే ఉండటం రైతులకు ఆనందాన్ని ఇస్తోంది. జిల్లాలో పండించిన బొప్పాయి దేశంలోని అన్ని ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. కాగా బొప్పాయి సాగులో ఎకరాకు మొదటి ఏడాది గరిష్టంగా రూ.50 వేల వరకు పెట్టుబడి వస్తుంది. బిందు సేద్య సదుపాయం కల్పించుకుంటే దిగుబడి ఎకరాకు 60 టన్నుల వరకు వస్తుంది. సూక్ష్మ సేద్యం కింద సాగు చేస్తే దిగుబడిలో నాణ్యత కూడా పెరుగుతుంది. చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సూక్ష్మ సేద్య సదుపాయాన్ని కల్పిస్తోంది.

బొప్పాయితో అనేక ఉపయోగాలు

బొప్పాయిలో సమృద్ధిగా లభించే విటమిన్-సీ దంతాలు, చిగుళ్ల ఆరోగ్యానికి, రక్తవృద్ధికి , రోగనిరోధక శక్తి పెరగడానికి తోడ్పడుతుంది. ఇందులో ఉన్న విటమిన్ బి నోటిపూత, తెల్లమచ్చలు, పెదాలపై పగుళ్లు రాకుండా కాపాడుతుంది. కెరోటిన్, ఏ,బి,సి,ఇ విటమిన్‌లు, ఖనిజాలు, ఫ్లేవొనాయిడ్స్, ఫోలేట్‌లు, పాంథోనిక్ ఆమ్లాలు, పీచు వంటి పోషకాలు బొప్పాయి పండులో పుష్కలం . దీంతో రోజురోజుకు బొప్పాయి పండు తినేవారి సంఖ్య పెరుగుతుంది. కొందరు రోజు వారి డైట్‌లో చేర్చుకుంటున్నారు. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌తో పాటు బరువును తగ్గిస్తుందని వైద్యులు చెబుతారు.

బొప్పాయి రైతులకు కలసి వచ్చే పంట



రైతులకు బొప్పాయి బాగా కలసి వచ్చే పంట. సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా బొప్పాయి సాగులో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంది. నాటిన 7 నెలల నుంచి కాపు ఇస్తుంది. రెండేళ్ల వరకు కాపు నిచ్చే బొప్పాయి లాభసాటి పంటనే. జిల్లాలో ఈ పంట సాగు పెరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో 5 వేల ఎకరాల బొప్పాయి సాగు ఉంది. ఈ ఏడాది మరో 1000 ఎకరాల్లో అదనంగా సాగు కానుంది. ఎకరాకు 50 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను ధర రూ.8000 నుంచి రూ.10 వేల వరకు ఉన్న రైతులకు గిట్టుబాటు అవుతుంది. ఉద్యాన పంటల్లో భాగంగా బొప్పాయి సాగును ప్రోత్సహిస్తున్నాము.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు